# దూరంలేని ప్రయాణం

ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఇప్పుడో, ఇంకాసేపటికో వర్షం వస్తుందనగా వాతావరణం ఎలా వుంటుందో శంకరం మనస్సు కూడా అలాగే వుంది. అన్ని మబ్బులూ వర్షించవు. వర్షించినా లేక పోయినా మబ్బుల అవతారం మటుకు బహు విచిత్రంగా వుంటుంది.

శంకరానికి దాదాపు జీవన్మరణ సమస్య ఇప్పుడు. కథలలో, సినిమాలలో జీవన్మరణ సమస్య ఎదురవడం అనుభవమే! అతనికి నిజజీవితంలో మటుకు ఇదే మొదలు. ఇకముందు అన్నీ యిటువంటివే ఎదురవుతాయా అని కాస్సేపు నిర్వేదం కూడా కలుగుతోంది అతనికి.

కొంతమందికి జీవితం వడ్డించిన విస్తరి అవుతుంది. ఏం కావాలంటే అది ఏరుకుని తినడం, అక్కర్లేనివి పారవేయడం మాత్రమే వాళ్ళు చేయవలసిన పని. కానీ, వాళ్లు పారవేసినవే ఇతరులకు అమృతప్రాయంగా తయారవడం విచిత్రమయిన పరిస్థితి.

శంకరం అవులించి ఆకాశం వంక చూశాడు. మబ్బులు! మబ్బులు! ఆకాశం ఎప్పుడూ స్పష్టంగా కనిపించదు. ఆకాశంలోని నీలిరంగు కేవలం కావ్యవస్తువు అయిపోయింది. 'నీలి గగనశ్యాముడు' ఊహాలోకంలోనే ఉండి పోతున్నాడు. నీలి కంఠంలోని 'గరళం' మాత్రమే ప్రత్యక్ష అనుభవంలోనికి వస్తోంది! తెలిసి తెలిసీ విషాన్ని మింగవలసి వస్తోంది. నిప్పులో చేతులు పెట్టి వేళ్లు కాలాయని మందు పట్టీలు వేసుకు తిరగాల్సి వస్తోంది. ఎంతో అనుభవం వున్నది అనుకున్నా, నిప్పులో వేలు పెట్టడం మటుకు తప్పనిసరి అయిపోతోంది.

అతను చదువుకుందాం అనుకుంటే ఆ ఊళ్ళో వున్న చదువు కాస్తా అయి పోయింది. పరాయి ఊరుకు వెళ్ళి చదువు కుందుకు కావలసిన హంగులు అందరికీ వుండవు. అలా వుండని వాళ్ళలో 'ప్రథముడు' తాను అనిపిస్తుంది శంకరానికి. 'చదివిన చదువు చాల్లే యింకేదయినా చిన్న ఉద్యోగం చూసుకుని

వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా...'

'ఎన్ని చదువులు చదివినా డబ్బు సంపాదన వచ్చేసరికి అదృష్టం కలిసి రావాలి.'

'మినప దోసెలు కాల్చుకునే గురునాథానికి లాటరీ అయిదు లక్షలు ఒక్కసారిగా వచ్చాయి. జీవితం అంతా కలెక్టర్ ఉద్యోగం చేసి రిటైరయినా అంత డబ్బు వస్తుందా?'

'ప్రతీదాన్ని డబ్బుతో తూకం వేయగూడదు. చదువు, సంస్కారం అమూల్యమైనవి. మనిషిని సరిగా రూపుదిద్దేవి ఇవే.'

'పూర్వజన్మ సంస్కారం వుంటేగాని ఇంత కలిగిన కుటుంబంలో పుట్టటం జరగదు.'

'మదనమోహన మాలవ్యాలాంటివాడు వీధి లాంతర్లదగ్గర చదువుకుని బాల్యం గడిపాడు. ఏ గొప్పవాడినయినా తీసుకో. వాడి బతుకు నడి బజారులోనే కలిసిపోయింది.. పట్టుదల, జీవితాన్ని తీర్చిదిద్దకోవాలనే కార్యదీక్ష కావాలి.'

'ఏ అందాల తారో వస్తే చేతనిండా కావలసినంత డబ్బు, హాయిగా షికారు తిరగడానికి రోజుకో కారు -- ప్రతి కల్చరల్ అసోసియేషనులోనూ గౌరవ సభ్యత్వం, సంఘంలో గొప్ప పలుకుబడి, ఎక్కడికి వెళ్ళినా ఘనమైన స్వాగతం....'

ఇటువంటి అపూర్వమైన సందేశాలు ఎన్నో శంకరం చెవినపడ్డాయి. తను ఏమిటి చేయడం? ఎప్పుడో ఏదో జరిగిపోతుందని ఎదురు చూస్తూ చిన్న ఉద్యోగంలో దూరిపోవడమా? లేకపోతే ఉన్నత ప్రమాణాన్ని అందుకుందుకు నిరవధికంగా కృషి చేయడమా?? తను ఏ ప్రయత్నం చేసినా ప్రోత్సహించేవాళ్ళూ వున్నారు, వెక్కిరించేవాళ్ళూ వున్నారు. కష్టపడి పైకి వచ్చినవాళ్ళను చూసి నవ్వుతూ నొసటితో వెక్కిరించే వాళ్ళకేం కరువులేదు లోకంలో. పైకి వచ్చిన తర్వాత బ్రహ్మరథం పట్టేవాళ్ళూ వున్నారు. ఎప్పుడూ వెనుకటి దరిద్రాన్ని, నికృష్ట జీవితాన్ని ఎత్తిచూపుతూ ఎద్దేవా చేసేవాళ్ళూ వున్నారు. వీళ్ళందరినీ చూస్తూ, వాళ్ళ ప్రమాణాలతో తనను కొలుచుకుంటూ కూర్చుంటే అవుతుందా?

శంకరం ముసుగుతీసి, అవతల పారవేసి మంచం మీదనుంచి లేచాడు. ఆకాశంలో మబ్బుల్ని కూడా ఇలా ఊడ్చి పారేయగలిగితే ఎంత ఆనందంగా వుంటుంది. మనస్సు నిర్మలం అయిపోతే హృదయానికి ఎంత సుఖంగా వుంటుంది. మెదడు మీద కాస్త సూర్యరశ్మి ప్రసరిస్తే కొత్త కొత్త ఆలోచనలు, స్ఫూర్తి వస్తాయి.

శరీరానికి కాఫీ తాగిన వెంటనే కాస్త ఉత్తేజం. ఈ ఉత్తేజం, స్ఫూర్తి ఎప్ప

టికి నిలువుకోవాలంటే ఏం చేయాలి? అదే శంకరానికి ఆలోచన అవుతుంది క్షణ క్షణమూను.

జీవితంలో ఏ రోజు కారోజు యింత బాధ, యాతన యిదివరకు ఎప్పుడూ పడలేదు అనిపిస్తోంది. మల్లెపువ్వులా పరుపుమీద పడుకొని కునికి పాట్లు పడటాన్ని గురించి కలలు రావు. చిరిగిన దుస్తులలో బకాసురుడులాంటి మనుషుల దగ్గర యాచనచేస్తున్నట్లు వస్తాయి కలలు. ఆఖరుకు కలల్లో కూడా సరయిన జీవితం కాదు తనది.

గదిలో పడుకుని చుట్టూ దుర్వాసన అనుభవిస్తూ ఈ వాసనకు ఎవరు బాధ్యులో తెలిసి కూడా యేమీ చేయలేని అసహాయ స్థితి! వెనకటి రోజులు తలుచుకుంటూ ఉంటే బాధ! మనసును యేనాడో గుప్పిట్లో పెట్టుకుని బిగించుకున్నట్లు అనిపిస్తుంది. భవిష్యత్తును గురించి ఊహించుకుంటే అనవసరంగా కాలయాపన చేస్తున్నట్లు అనిపిస్తుంది. వర్తమానంలో బతకాలని తన ఊహ, ఆలోచన, సంకల్పం కాని బతకడం యెలాగో తెలియదు. ఎవరో ఉత్తరంరాసి యిస్తే వెళ్లాడు ఒక పెద్దమనిషి దగ్గరకు ఉద్యోగం యాచించడానికి.

"కూర్చో" అన్నాడు ఆయన.

కాని అక్కడ కుర్చీలేదు.

"ఫరవాలేదండీ" అన్నాడు తను మొహమాట పడుతున్నట్టుగా.

అంతే! మళ్లీ ఆయన కూర్చోమనే మాట మరిచి పోయి వ్యవహారంలోకి దిగాడు.

"చూడు నాయనా! రోజులు చాలా కష్టంగా వున్నాయి. పెద్ద పెద్ద చదువులు చదివిన వాళ్లకే ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరకడం కష్టం అయిపోయింది...." ఇటువంటి మాటలు అనేక పర్యాయాలు వినడం అయింది. గ్రామఫోన్ రికార్డు.

ఇంతకూ తను పట్టి బి.ఏ. అందువల్ల ఎక్కడా ఉద్యోగం దొరకదు. అందరూ పెదవులతో సానుభూతి చూపుతారు. మనకు వినే ఓపిక వుంటే 'నిరుద్యోగ సమస్య' మీద, దాని పుట్టు పూర్వోత్తరాల గురించి, దానిని నిర్మూలించటానికి మరెవరు ఎలా ప్రయత్నం చేసిందీ... సోదాహరణంగా ప్రసంగిస్తారు.

"అప్పుడప్పుడు కనిపిస్తూ వుండు" అన్నా డాయన చివరకు, తను నిరాశతో సెలవు తీసుకువెడుతూ వుంటే.

"అలాగేనండీ. నమస్కారం. వస్తాను" అని నాలుగడుగులు ముందుకు వేసే

సరికి, "చూడు నాయనా! నువ్వు వుండేది ఎక్కడ?" అని అడిగాడు.

శంకరం వినయంగా మళ్లీ వెనక్కు వెళ్ళాడు.

చెప్పాడు.

"బుధవారం సాయంత్రం నేను ఫలానా చోటుకు వస్తాను. సరిగ్గా నాలుగు గంటలకు అక్కడకు రాగలవా? నీవు వుండే చోటుకు అది అంత దూరం కాదనుకుంటాను?"

"తప్పకుండా వస్తానండీ"

...బుధవారం తాను కలుసుకోవలసింది తన పనిమీదనో, ఆయన పని మీదనో తెలియదు. తను కలుసుకుంటున్నది ఆవునో, పులినో అసలే తెలియదు.

దరిద్ర దేవత నెత్తిమీద కూచున్నంతసేపూ జరగదు. శారదా ప్రసన్నం అయింది తనకు. అందరూ అసూయపడేట్లు బి.ఏ. మొదటి తరగతిలో ప్యాస్ అయినాడు తను. ఉద్యోగం కోసం ఎవరిని అడిగినా "చక్కగా మొదటి తరగతిలో ప్యాసయినావు గదా. ఎం.ఏ. చేయరాదా?" అంటారు. ఇంత వరకూ రోజులు నెట్టివేయడానికి తను ఎంత కష్ట పడ్డాడో ఎలా తెలుస్తుంది? ఎవరికి అవసరం? తన పరిస్థితి సిగ్గు విడిచి నోటితో చెప్పకుందుకయినా చేతకాకుండా పోతోంది రోజులు గడిచినకొద్దీ.

ఏదయినా చిన్న ఉద్యోగం. కనీసం నేలకో రెండు వందలు తెచ్చుకుందుకు వీలయిన ఉద్యోగం. అది దొరికితే తన సమస్య తాత్కాలికంగా పరిష్కారం అవుతుంది. ఆ ఉద్యోగం అందీ అందనట్లు ఆకాశంలోనికి ఎగిరి పోతోంది. దాన్ని రెండు చేతులతోను అంది పుచ్చుకుందుకు తను ఆకాశంలోకి ఎగరలేడు. నేలమీద పరుగులు తీయలేడు.

స్తబ్ధత! స్తబ్ధత అంతటా ఆవరించి వుంది తన మనస్సును. దీన్ని పారదోలడం ఎలా?

ఎందుకు యేర్పడిందో తెలుసు ఈ స్తబ్ధత.

ఎలా పారదోలాలో కూడా తెలుసు. అయితే పారదోలగల మార్గం మటుకు కనిపించడం లేదు. అవకాశం రావడం లేదు.

అందమైన మందారాలు ముడుచుకుని వచ్చింది సుగుణ. మబ్బులతో నిండిన ఆకాశంలో ఓ కాంతి రేఖ వెలిగినట్లు అవుతుంది. శంకరానికి సుగుణ కనిపించినా, సుగుణను గురించిన ఆలోచన మనసులో మెదలినా ఈ ఆలోచన మనసుతో ఆగిపోయేది కాదు. తిన్నగా హృదయద్వారాలు తెరుచుకుని లోపలకు

వెళ్లి కూర్చుంటుంది. అక్కడ వున్న మందిరంలో తిష్ట వేసుకుని కొంతసేపు సన్నటి మంచు కిరణాలు చల్లుతుంది. మల్లె పరిమళం విస్తరిస్తుంది. బయటి వాతావరణం మళ్ళీ ఉక్కిరిబిక్కిరి చేసేంతవరకూ ఈ ప్రశాంతత నిలుస్తుంది.

"సుగుణా! చాలా రోజులైంది మీరు కనిపించి"

"అవును. ఈ మధ్య కలకత్తా వెళ్లాను, మా అన్నయ్యగారి ఊరికి. వచ్చి రెండు రోజులైంది."

"ఎలా వుంది కలకత్తా?"

సుగుణ నవ్వుతోంది. ఏమిటో చెబుతోంది. కలకత్తాలో ట్రాముల రొద, సముద్రపు ఒడ్డున హడావుడి, తీరుబడి లేకుండా పరుగెత్తే జన సందోహం.

కాని కలకత్తా పేరు విన్నప్పుడల్లా తనకు స్ఫురణకు వచ్చేది ఒక్కటే ఒక్కటి. కాళీ నాలుక! కాళీ విగ్రహం తాను చూడలేదు. కలకత్తా పొలిమేరలు తొక్కలేదు. ఫోటోలలో మాత్రం చూశాడు కాళీమాత రూపు! ఒక్కమాటు ప్రసన్నంగా వున్నట్లు అనిపిస్తుంది. ఒక్కోమారు చాచిన నాలుక అగ్ని శిఖలాగా కనిపిస్తుంది. దేన్ని దహించివేస్తుంది ఇది? ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాన్నీ, అక్రమాన్నీ?... నోట్లో నాలుకలేక పరిస్థితులు ఎటు తరిమి కొడితే అటు పరుగులు తీసే వెర్రి ప్రజలనా? ఏమో! ఏమో!

"మా అన్నయ్యకు చెప్తాను మీ సంగతి. మీరు కలకత్తా వెళ్ళండి అడ్రస్ ఇస్తాను. ఎందుకు ఊరికే ఇక్కడి 'రాట్' అయిపోతారు?" అంటోంది సుగుణ.

సుగుణ ఇలా చెప్పడం మొదలుకాదు.

నక్క—నాగలోకం స్ఫురణకు వస్తాయి. తను... కలకత్తా!

కలకత్తా వెడితే చాలు. అన్నీ సరిపడిపోతాయనీ, తన జీవితగమనమే మారిపోతుందనీ అంటుంది సుగుణ. నిజమేకావచ్చును. తనకు తెలియదు. కాని కలకత్తా వెళ్ళడం ఎలా? టిక్కెట్టులేని ప్రయాణికుడిలా తయారవాలా? తనకూ, తన చదువుకూ అవమానం! బైరాగి వేషం అయినా వేయగలిగితే అంత దూర ప్రయాణం చేయవచ్చును.

ఈ విషయాలు తలుచుకుంటే నవ్వు, ఏడుపూ వస్తుంది శంకరానికి.

భారతదేశం పుణ్యభూమి. బైరాగులకూ, స్వాములకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉన్నాయి. కాని తనకు వేషం వేయడం చేతకాదు. దానికి కావలసిన ధైర్యం తనకు లేదు.

సుగుణ అమాయకత్వం చూస్తే మళ్లీ నవ్వు వస్తుంది. తనలో ఏదో గొప్ప కాన్ఫిడెన్స్ ఆ పిల్లకు. ఏదో రోజు తనకు 'పరమ వీరచక్ర' బిరుదు వస్తుందని ఆ పిచ్చిపిల్ల త్రికరణ శుద్ధిగా నమ్ముతోంది.

"మీరు ఊ.. అనండి మాష్టారూ నేను ఉత్తరం రాస్తాను అన్నయ్యకు" అంటుంది.

"ఆలోచించి చెబుతాను" అంటాడు తను ఎన్ని మార్లయినా. ఈ ఆలోచనకు తుది లేదు. రాజకీయాలు-కులాలు-మతాలు-తీసుకొస్తున్న సమస్యలు మధ్య తనకు ఇక్కడ కాదు, ఈ దేశంలోనే ఉద్యోగం దొరకదు. ఉద్యోగం దొరికితే గాని యేమీ ఆలోచించి ప్రయోజనం లేదు.

జ్ఞాన తృష్ణ పట్టి వల్లార్చింది తనను.

బి.ఏ. తర్వాత ఏం.ఏ. ఆ పైన పి.హెచ్.డి. ఇలా చదువును పొడిగించుకుంటూ పోతే—సమస్యను సాధ్యం అయినంత వాయిదా వేసుకుంటూ పోతే...! అయితే ఎంత దూరమని యితరుల ఔదార్యం మీద ఆధారపడడం?

ఈ రోజు చేయవలసిన పనులు నెమరు వేసుకున్నాడు. ఎక్కడైన నూరు రూపాయలు సంపాదించి కలకత్తా వెళ్ళిపోతే? దొంగతనం చేయాలంటే భయం! రూపాయి, రెండు అప్పు అడగటం వర్వాలేదు గాని నూరు రూపాయలు అడిగితే తనకు ఇచ్చె వాళ్ళు-తనకు తెలిసినంతలో యెవరూ లేరు, సుగుణ యిస్తుందేమో తెలియదు. కాని ఆమెను అడగటానికి ముఖం చెల్లదు. ఇప్పటికే ఆ అమ్మాయి దగ్గర ఎక్కువ చనువు అయిపోయింది. డబ్బు అడిగితే తన యిమేజ్ యేమయిపోతుంది?

కాళ్ళు నీరసంగా వున్నా, కడుపు నక నక లాడుతున్నా రోడ్ల వెంట నడవడం మానడానికి లేదు.

జుట్టు పెరిగి పోతోంది. రెండు మూడు రూపాయలు వుంటేగాని సెలూన్ వాళ్ళు చెప్పిన మాట వినరు. ఆ డబ్బు వుంటే... ఓ వారం రోజుల పాటు ఆకులు, అలములు తింటూ కాలక్షేపం చేయవచ్చు. కళ్ళు కాయలు కాసేట్లు చూస్తున్నా డబ్బు యింకా రాలేదు. ఎప్పుడు వస్తుందో తెలియదు. వస్తుందనే ఆశ మటుకు వుంది. అంతవరకూ ఎలాగయినా వేచి వుండాలి.

లాటరీ డబ్బు కాదు. వారసత్వంలో వాటాకాదు. తన 'వ్యాసం' ప్రచురించిన పత్రిక పంపించే డబ్బు. 'సుమతీ శతకంలో జీవితపు విలువలు' గురించి వ్యాసం రాశాడు మారు పేరుతో. మారుతున్న సమాజంలో ఇంకా మారపోని

మనిషి తను. అందుకనే కలం పేరు మారు పేరు.

శంకరం ఊహల్లో తేలిపోతున్నప్పుడు ఎవరో భుజంమీద చేయి వేస్తారు. 'ఎందాక? ఏమన్నా దొరికిందా? ప్రయత్నం చేస్తున్నావా...' ఇలా కుశల ప్రశ్నలు వేస్తారు. నిరంతర ఉద్యోగాన్వేషిగా తయారయిపోతున్నాడు తను.

గాలి పీల్చడం లాగ ఉద్యోగాల కోసం వెదకడం తనకు సహజ మయిపోయిది. జీవితాంతం ఇలా వెదుకుతూనే వుంటాడు.

ఆత్మహత్య చేసుకున్న వాళ్ళను ఒకళ్ళు ఇద్దరిని ఎరుగును తను. వాళ్ళు ఆ పరిస్థితిలో అంతకంటే మార్గంలేక ఆ పని చేశారనీ ఎంత నచ్చచెప్పుకుందా మని ప్రయత్నించినా మనసుకు సమాధానం దొరకదు. జీవితం జీవించటానికి. 'డెలిబరేట్'గా దాన్ని అంతం చేసుకుని, క్లుప్తంచేసుకుని బతకటానికి ఎవరికీ హక్కులేదు. ప్రస్తుతం తన అభిప్రాయం ఇది. ముందు ముందు మారుతుం దేమో తెలియదు.

బంతి వెనకాల పరుగెత్తడం చేతకాదు తనకు. ప్రతిసారీ ఆటలో ఓడిపోతు న్నాడు. పోనీ స్థాయిగా నిలుచుని బంతి తన దగ్గరకు వచ్చినపుడు ఒక్క 'కిక్' యిద్దామంటే తను చూస్తున్నంతసేపూ బంతి తన దరిదాపులకే రావడంలేదు.

రైలు స్టేషన్‌కు చాలా దూరంలో వున్నాడు తను.

కలకత్తా వెళ్ళిపోతే!

ఏసుయితే అదవుతుంది.

ఈ దారిద్ర్యాన్ని ఇక్కడే ఇప్పుడే అనుభవించాలని తాపత్రయం ఎందుకు తనకు? దానినే శాశ్వతం చేసుకోవాలని కోరిక ఎందుకు?

ఏమో ఎందుకు ప్రయత్నించకూడదు? సుగుణ ఇన్నాళ్ళ నుంచి చెబుతోంది. ఆమె మాట ఎందుకు తీసి వేయాలి? ప్రయత్నిస్తే నష్టమేం?

కలకత్తా జూట్ మిల్స్‌లో జనపనార తాళ్ళు పేనటానికి ప్రయత్నించ గూడదూ?— ఇక్కడ గంటకు ఎన్ని నిమిషాలో, నిమిషానికి ఎన్ని సెకన్లో లెక్క పెడుతూ కూర్చోవడం కంటె!

ఈ మారు సుగుణ కనిపించినప్పుడు... ఎప్పుడో కనిపించేదాకా ఎందుకు వేచివుండాలి? ఈ ఆలోచన ఇప్పుడు కలిగినందుకు వెంటనే ఆమెను కలుసు కుందుకు యెందుకు ప్రయత్నించగూడదు?

సుగుణ ఇల్లు తెలుసు. ఈ సమయంలో ఆమె ఇంట్లోనే వుంటుంది. అయినా అడుగు తీసి అడగటానికి భయం. జంకు. ఏదో దౌర్బల్యం.

మబ్బులు తొలగిపోయేట్లు మనస్సు విరామం అయేట్లు కావాలంటే ఏం చేయాలి?

సుగుణ యింటి ముందుకు చేరుకున్నాడు శంకరం.

గేటు ముందు తారట్లాడుతూ వుండగా బొచ్చుకుక్క అరవనే అరిచింది. భయం వేసింది తనకు. పారిపోదాం అనుకున్నాడు. పారిపోతే కసిగా వెంట పడుతుందని గుర్తుకువచ్చి ఊరుకున్నాడు.

సుగుణ బయటకు వచ్చింది, చూసింది.

"రండి మాష్టారు" అంది.

శంకరం కూర్చున్నాడు.

"నేనే మీ దగ్గరకు వద్దామనుకుంటున్నాను ఈ సాయంకాలం, మీరే వచ్చారు. సంతోషం!"

శంకరం కాఫీ తీసుకుంటున్నాడు.

ఒక్కొక్క గుక్క లోపలకు వెడుతున్న కొద్దీ కొత్త ఉత్సాహం స్ఫూర్తి కలుగుతు న్నట్లు అనిపిస్తోంది.

"మీరు ఉత్తరం ఇస్తే కలకత్తా వెడతాను."

"కలకత్తా వద్దు. ఇక్కడే వుండండి"

శంకరం గుండె నీరస పడిపోయింది. తను నిశ్చయం చేసుకున్నాక సుగుణ వద్దంటోంది. ఎందుకని? ఆమె ఉత్తరం లేకుండా కలకత్తా వెళ్ళి తను యేం చేయగలడు? కేవలం 'బే ఆఫ్ బెంగాల్'లో పడడానికే అయితే అంత దూరం వెళ్ళనక్కర్లేదుగా.

"మా అన్నయ్య వస్తున్నాడు రేపు సాయంత్రం. మీతో మాట్లాడుతానన్నాడు. మీరు ఎక్కడికి వెళ్ళకండి!"

నాతో ఏం మాట్లాడతాడు? అంత పెద్దవాడికి నాతో మాట్లాడవలసింది ఏం వుంటుంది? తనకు మాట్లాడడం చేతనవుతుంగా అసలు అటువంటి పెద్దవాళ్ళముందు?

"మా అన్నయ్య కంపెనీవాళ్ళు ఇక్కడ ఒక బ్రెన్‌తో లావాదేవీలు పెట్టుకుంటున్నారు. కలకత్తాకంటే ఇక్కడ ప్రింటింగ్ ఖర్చులు తక్కువట! అందుకని అచ్చుపనంతా ఇక్కడే, ఇకముందు. ఈ బ్రెన్‌తో మాట్లాడేందుకు వస్తున్నాడు మా అన్నయ్య. ఒక రోజు వుండి వెళ్ళిపోతాడు."

తనను కూడా తీసుకువెళ్ళమని బ్రతిమలాడాలి, ప్రాధేయపడాలి అనిపించింది

శంకరానికి. జూట్ మిల్లులో ఏదో పని చిన్నది-ఆఖరుకు 'టైం కీపర్' అయినా సరే!

"మా అన్నయ్యకు ఇక్కడ నమ్మకమైన మనిషి కావాలట రేపటినుంచి ప్రెస్ వాళ్ళతో పని చేయించేందుకు. ఏ పని ఎంతవరకు వచ్చిందో తనకు ఏ రోజుకు ఆరోజు తెలియపరచేందుకు, ఏమయినా కొత్తకొత్త ఫస్ట్‌హేండ్ ఇన్‌ఫర్‌మేషన్ ఇచ్చేందుకు – మా అన్నయ్య మీమీద ఆశపెట్టుకున్నాడు. నమ్మకమయిన మనిషి కావాలి అందుకోసం.."

కలకత్తా వెళ్ళనవసరంలేదు.

తను నమ్మకంగా ఇక్కడవుంటే చాలు.

రేపు సాయంత్రం ఆకాశంలో మబ్బులు విచ్చిపోతాయో!

శంకరం తల పైకెత్తి చూశాడు. మబ్బులు అప్పుడే ప్రయాణం ఆరంభించి నట్లు అనిపించింది అతనికి.

❀